ఆంధ్రజ్యోతి

జయశంకర్ భూపాలపల్లి ములుగు

గురువారం 8 ఆగస్టు 2024



ఇబ్బందులు లేకుండా పనులు జరుగుతున్నాయి..

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఐదురోజుల పాటు గ్రామాలల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పల్లెలను శుభ్రంగా తయారుచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దానిలో భాగంగా ఈ నెల 5 నుంచి 3 రోజులుగా రోజుకొక్క కార్యక్రమంతో గ్రామాల్లో ఎలాంటి అటంకాలు లేకుండా కార్యదర్శులు విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్లి పరిశీలిస్తే కార్యక్రమం ఏ విధంగా జరుగుతుందనేది అర్థమవుతుంది.

- లక్ష్మీరమాకాంత్, జిల్లా పంచాయతీ అధికారి, హనుమకొండ జిల్లా



పల్లెలపై.. పట్టింపేదీ?

చిల్లి గవ్వ లేక గ్రామపంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తం



- నిధులను నిలిపివేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- పైసలు రాక పనులు చేయడంలో ఇబ్బందులు
- 'స్వచ్ఛదనం- పచ్చదనం'కు డబ్బుల కొరత
- పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక రోగాల బారిన ప్రజలు
- మంత్రి సీతక్క చొరవ తీసుకోవాలని విన్నపం

హనుమకొండ టౌన్, ఆగస్టు 7: దేశానికి పట్టు కొమ్మలైన పల్లెల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. పంచాయతీలకు నిధుల్లేక పల్లెలన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పల్లెల అభివృద్ధిపై ప్రభుత్వానికి పట్టింపులేక పోవడంతో ప్రగతికి దూరంగా మగ్గుతున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయిన నాటి నుంచి పంచాయతీలకు కష్టాలు మొదలయ్యాయి. గ్రామపంచాయతీని నమ్ముకున్న వారంతా రోడ్డున పడ్డారు. కార్మికులతో పాటు సర్పంచ్‌లు తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలు, బకాయిల కోసం ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. అయినా ఇవేమీ పట్టించుకోని ప్రభుత్వం.. గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వకుండానే పనులు చేయాలని పంచాయతీ రాజ్ శాఖకు ఆదేశాలు జారీ చేస్తోంది. దీంతో కిందిస్థాయిలో ఉన్న కార్యదర్శులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మరోపక్క నిధులలేమి కారణంగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సమస్య జటిలమై.. ప్రజలు దోమకాటుకు గురై మంచాన పడుతూ ఆస్పత్రుల ఖర్చులు భరించలేక చివరికి ప్రాణాలు వదులుతున్నారు.

నిధులకు మంగళం

పల్లెల్లో ఏ అభివృద్ధి చేపట్టాలన్న కార్యదర్శులు గ్రామ ఆదాయాన్ని నమ్ముకొని పనులు చేయాలి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులను నిలిపివేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో సర్పంచ్, కార్యదర్శులు పంచాయతీని నెట్టుకొచ్చేవారు. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఎనిమిది నెలలు కావస్తుండటంతో మార్చి నెల నుంచి కేంద్రం కూడా నిధులివ్వడం ఆపేసింది. దీంతో గ్రామ ఆదాయమే పంచాయతీలకు ఏకైక దిక్కుగా మారింది. ఖర్చులు ఎక్కువ, ఆదాయం తక్కువ కావడంతో అభివృద్ధిని గాడిలో పెట్టడం కార్యదర్శులకు సవాల్‌గా మారింది. పంచాయతీల్లో యేటా వచ్చే ఆదాయం రెండు, మూడు నెలలకు కూడా సరి పోవడం లేదని కార్యదర్శులు వాపోతుంటే.. మాతృశాఖేమే జేబులో నుంచి పెట్టుకోవాలని ఒత్తిడి పెంచడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలోని గ్రామపంచాయతీలు	
వరంగల్	323
హనుమకొండ	208
భూపాలపల్లి	241
ములుగు	174
మహబూబాబాద్	461
జనగామ	281
మొత్తం	1,688

స్వచ్ఛదనం-పచ్చ'ధనం'కు నిల్

సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటి నుంచి కార్యదర్శులు గ్రామాభివృద్ధికి తమ జేబులో నుంచి పెట్టుబడి పెట్టుకుంటూ వస్తున్నారు. సర్పంచ్‌లు ఉన్నంతసేపు వారే పెట్టుబడి పెట్టి పల్లెలను ప్రగతి పథాన నడిపించారు. అలా తాము పెట్టిన సొమ్ములను తిరిగి ఇవ్వలేదని సర్పంచ్‌లు, పని చేయించుకుంటూ పైసలు ఇస్తలేరని పంచాయతీ కార్మికులు వివిధ రూపాల్లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇవన్నీ తెలిసినా ప్రభుత్వం మాత్రం ఎలాంటి బడ్జెట్‌ను విడుదల చేయకుండా కొత్తగా స్వచ్ఛదనం- పచ్చదనం పథకాన్ని తీసుకొచ్చి కార్యదర్శులపై ఒత్తిడిని పెంచింది. ఐదు రోజుల కార్యక్రమాన్ని రూపొందించి ఒక్క పైసా విడుదల చేయకుండా కార్యదర్శులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, కార్యదర్శులు సైతం చేసేదేమీ లేక పల్లెల్లో నలుగురిని కలుపుకొని తూతూమంత్రంగా కార్యక్రమాన్ని నిర్వహించి ఐదు రోజుల కార్యక్రమంలో ఏ రోజుకారోజు మమ అనిపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పైసలు ఇవ్వకపోతే పాపం కార్యదర్శులు మాత్రం ఏం చేస్తారని ప్రజలు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. ఇక మాజీ సర్పంచులేమో తమ పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో తాము అప్పులు తెచ్చిన చోట వడ్డీలు పెరుగుతున్నాయని వాపోతున్నారు.

ముందు పెట్టండి.. తర్వాత వస్తాయి..

8నెలల నుంచి పంచాయతీల్లోని చిన్న చిన్న అవసరాలకు కార్యదర్శులు వారి జేబుల్లో నుంచి డబ్బులు పెట్టుకుంటూ ఆర్థికంగా చతికిలపడతూ వస్తున్నారు. తాజాగా ఆగస్టు 5 నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం చేపట్టి ఐదు రోజుల్లో ఒకొక్కరోజు ఒక కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. కానీ పనులు చేసేందుకు మాత్రం పైసలు లేవు.. మీరే జేబుల్లో నుంచి పెట్టండి.. తర్వాత మీ అకౌంట్స్‌కు జమ చేస్తామని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తుండటంతో కార్యదర్శుల పరిస్థితి మూలిగే నక్కమీద తాటికాయ పడ్డ చందంగా మారింది. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమానికి ముందు జిల్లా పంచాయతీ అధికారి నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో పలువురు కార్యదర్శులు తమ బాధలను విన్నవించుకున్నప్పటికీ.. తాను చేసేది ఏమీ లేదని, ఏమైనా ఉంటే కలెక్టర్‌కు చెప్పుకోండి.. అంటూ దాటేసినట్లుగా సమాచారం. జిల్లా పంచాయతీ అధికారి నుంచే సరైన మద్దతు లేనప్పుడు తమకు దిక్కెవరని కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు.

పల్లెల్లో రోగాల విజృంభణ

నిధుల లేమితో పల్లెల్లో దోమల నివారణకు పిచికారి, చెత్త సేకరణ అరకొరగా చేస్తున్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు అందక నిరసన బాట పట్టడం ఒకపక్క అయితే.. మరోపక్క చెత్త తరలించేందుకు ట్రాక్టర్లలో డీజిల్ పోయ లేక మరోపక్క పల్లెల్లో శానిటేషన్ దుర్భరంగా తయారైంది. వర్షాకాలం నేపథ్యంలో మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగి చెత్తంతా జమై పల్లెల్లో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో దోమకాటుకు ప్రజలు మంచాన పడుతున్నారు. దీంతో ఇటీవల పల్లెల్లో జ్వరాలు పెరిగి డెంగీతో మరణించిన సందర్భాలు ఉన్నాయి. గ్రామాల అభివృద్ధికి సరిపడా నిధులను సమకూర్చి పల్లెల్లో ఆరోగ్య వాతావరణం కల్పించేలా పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అడకత్తెరలో..



- నిధుల లేమితో గ్రామ కార్యదర్శుల ఇబ్బందులు
- అప్పులు చేసి గ్రామాలను నెట్టుకొస్తున్న వైనం
- ఒక్కో కార్యదర్శికి రూ.లక్షకు పైగా ఖర్చు
- ప్రత్యేక పాలన ఆరంభం నుంచి ఇదే దుస్థితి

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 7: ఓ వైపు పని ఒత్తిడి.. మరో వైపు నిధుల లేమి.. అయినా తప్పదు గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి బాధ్యత మీదే అంటూ ప్రభుత్వ ఆదేశాలు.. వెరసి గ్రామ కార్యదర్శుల పరిస్థితి 'అడకత్తెరలో పోకచెక్క'లా తయారైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతోంది. ప్రత్యేక పాలన ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు గ్రామంలో ఎలాంటి సమస్యలు వచ్చినా వారి సొంతడబ్బు పెట్టు కుని పనులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇక మైనర్ గ్రామ కార్యదర్శుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. దీనికి తోడు ప్రభుత్వం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తుండటంతో ఇబ్బందులు రెట్టింపయ్యాయి. కొన్నిచోట్ల కార్యదర్శులతో పాటు స్పెషల్ ఆఫీసర్లు కూడా వారి సొంత డబ్బులు పెట్టుకుని మరీ కార్యక్రమాలను నెట్టుకొస్తున్నట్లు సమాచారం.

నిర్వహణ భారం

ఏడు నెలల నుంచి గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యత పూర్తిగా కార్యదర్శులపైనే పడింది. గ్రామంలో ఏ పనిచేయాలన్నా డబ్బులు లేకపోతే అంతే పరిస్థితి. వస్తున్న పన్నులు కార్యాలయ నిర్వహణ, సిబ్బంది జీతాలకే చాలడం లేదు. దీంతో కొన్ని నెలలుగా సిబ్బంది జీతాలు సైతం లేక విల విలలాడుతున్నారు. నీటి సరఫరా మొదలు.. పారిశుధ్యం, వీధిదీపాలు, చెత్త వాహనాల నిర్వహణ, ట్రాక్టర్ల ఈఎంఐలు ఇలా ఎన్నో ఇబ్బందులు పడుతూ పంచాయతీ పాలనను ముందుకు తీసుకెళ్తున్నారు. బోరు మోటార్లు బాగు చేయించడం, కల్వర్టులను శుభ్రం చేయించడం,

మిగతా 7వ పేజీలో..

నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం..

'ప్రత్యేక పాలన నుంచి పంచాయతీల్లో నిధుల కొరత ఉంది. ప్రస్తుతం జరుగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి సైతం ప్రత్యేక నిధులేమి లేవు. జీపీ నుంచి అన్ని కార్యక్రమాలకు డబ్బులు వెచ్చిస్తున్నాం. ఎలాంటి కార్యక్రమాలకైనా కార్యదర్శులమే జేబుల్లో నుంచి పెట్టుబడి పెడుతున్నాం. బ్యాంకుల్లో చెక్కులు కూడా పాస్ కావడం లేదు. ఇలా దాదాపు మేజర్, మైనర్ గ్రామ పంచాయతీల్లో రూ.లక్షకు పైగా డబ్బులు ఖర్చు చేసి ఉన్నాం' అంటూ ఓ పంచాయతీ కార్యదర్శి తన ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 7: రైస్‌మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ రైస్ డెలివరీ లక్ష్యాలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రాంపతి, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్, రబీ సీజన్‌లో సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లుల వారీగా సీఎంఆర్ రైతు డెలివరీ లక్ష్యాలు కేటాయించినట్టు తెలిపారు. వాటిని రైస్‌మిల్లులు సకాలంలో పూర్తిచేసేలా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. రైస్‌మిల్లుల లక్ష్యాల పూర్తిపై అదనపు కలెక్టర్లు పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ రైస్ డెలివరీ గడువులోగా అందించేలా చూడాలన్నారు. 2024-25వానాకాలం సాగు కింద జరుగుతున్న వరిపంట సాగు విస్తీర్ణం, రాబోతున్న ధాన్యం దిగుబడి, తగిన విధంగా ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు.

కార్పొరేట్ కంపెనీలు పల్లెబాట పట్టాలి

- దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలి
- ఐటీ కంపెనీ ప్రతినిధులను కోరిన మంత్రి సీతక్క
- ములుగు నియోజకవర్గానికి సీఎస్ఆర్ నిధులిచ్చేందుకు సుముఖత



ఐటీ కంపెనీల ప్రతినిధులతో సమావేశమైన మంత్రి సీతక్క

ములుగు, ఆగస్టు 7: కార్పొరేట్ కంపెనీలు పల్లెబాట పట్టాలని, అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలకు తమవంతు సహకారం అందించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ప్రజాసేవలో సంతృప్తి పొందినవారే అసలైన శ్రీమంతులని తెలిపారు. సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకరతో కలిసి హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, క్వాల్కమ్, బోష్, గ్రాన్యుల్స్ ఇండియా, టీసీఎస్. ఉషా, నిర్మాన్, తదితర కంపెనీల ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ఐటీ, వ్యాపార సంస్థలు సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలని కోరారు. మనతోపాటు చుట్టూ ఉన్న వాళ్లు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో ముందుకు వస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. వెనుకబడిన గ్రామాలను దత్తత తీసుకొని స్థానిక సమస్యలను పరిష్కరించడమే కాకుండా అక్కడి యువతకోసం స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఇప్పటికే ఆదిలాబాద్, ములుగు జిల్లాలలో కొన్ని కంపెనీలు గ్రామాలను దత్తత తీసుకొని మార్పును ఆచరణలో చూపించాయని తెలిపారు. విద్య, వైద్యం, పారిశుధ్యం, ఉపాధి, పారిశుధ్య నిర్వహణ, మంచినీరు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలలో చేయూతనిచ్చేలా కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. తన పిలుపుమేరకు ములుగుతోపాటు పలు నియోజకవర్గాల్లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బుల్ (సీఎస్ఆర్) నిధులను వెచ్చించేందుకు ముందుకు రాగా సీతక్క వారికి అభినందనలు తెలిపారు. కాగా, ములుగు జిల్లాలో నెలకొన్న పరిస్థితులు, అవసరాలు, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ దివాకర వివరించారు.

ప్రైవేటుకు దీటుగా సర్కారు విద్య

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

వివరాలు : 8లో..

మన వస్త్రాలకు విదేశాల్లో ఆదరణ

- కలెక్టర్ రాహుల్ శర్మ

8

ఏజెన్సీలో జోరు వాన

- వెంకటాపురంలో 82.6 మి.మీ వర్షపాతం
- పొంగుతున్న వాగులు, వంకలు

ములుగు, ఆగస్టు 7: జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. 45.8 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వెంకటాపురం(నూగూరు)లో 82.6మి.మీ వర్షం కురిసింది. దీంతో చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు చేరింది. గోవిందరావుపేట మండలంలోని ప్రఖ్యాత లక్నవరం చెరువు, మంగపేట మండలంలోని మల్లూరు ప్రాజెక్టు మత్తడి పోస్తున్నాయి. ఏటూరునాగారం మండలంలోని కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం మండలాల్లో బుధవారం భారీవర్షం కురిసింది.

వర్షపాతం ఇలా..

వెంకటాపురం(నూగూరు) మండలంలో అత్యధికంగా 83.6 మి.మీ, ఏటూరునాగారం 76.4మి.మీ, వాజేడు 61.2.మి.మీ, గోవిందరావుపేట 51.0మి.మీ, మంగపేట 40.0మి.మీ, కన్నాయిగూడెం 42.2.మి.మీ, తాడ్వాయి 38.8మి.మీ, ములుగు 7.2మి.వీ, వెంకటాపూర్(రామప్ప)లో 12.8మి.మీ వర్షం కురిసింది.



స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా 2వ ఆర్థిక సంఘం సమీక్ష



మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు7: స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా 2వ ఆర్థిక సంఘం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ.. గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. గ్రామీణ, పట్టణ సంస్థల అభివృద్ధికి కావాల్సిన నిధులను సమకూర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్ర స్థానిక సంస్థల అభివృద్ధికి నిధుల మంజూరులో జాప్యం లేకుండా సిఫారసు చేసిన నిధులను మంజూరయ్యేలా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు నిధులు కేటాయించామన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ఎల్, 243వై ఆదేశం ప్రకారం మన రాష్ట్రంలోని అన్ని గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణాల ఆర్థిక స్థితిగతులను సమీక్షించడానికి, ఆర్థిక వనరుల పంపిణీ సిఫారసు చేయడానికి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసిందన్నారు. గ్రామ పంచాయతీల అధికారుల విధులు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 52 ప్రకారం గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు మరిచిపోవద్దని రాజయ్య పేర్కొన్నారు. ప్రతీ గ్రామానికి అవసరమయ్యే అభివృద్ధి పనుల వివరాలు పూర్తి సమాచారం భద్రపరుచుకునేలా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోని ఆస్తి పన్నుపై మళ్లీ పూర్తి సమీక్ష చేయాలన్నారు. విద్యుత్ చార్జీల అధిక బారం పడకుండా ప్రతీచోట సోలార్ పవర్ ప్లాంట్లను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతీ గ్రామ పంచాయతీలో క్రమం తప్పకుండా ప్రతీ 60 రోజుల్లో గ్రామసభ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్య, ఇతర అభివృద్ధి పనులకు సకాలంలో నిధులు అందుబాటులో ఉన్నట్లయితే ప్రతీ పనిని

మిగతా 8వ పేజీలో..

చెరువుల్లో గుర్రపు డెక్కలు తొలగించాలి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 7: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 9 చెరువులు, కుంటలలో గుర్రపు డెక్కలు పెరిగి పరిసరాలు కలుషితమవుతున్నాయని, చెరువుల్లో మొలిచిన గుర్రపు డెక్కలను వెంటనే తొలగించాలని చెరువులు, ఆక్రమణ ఏరియాల పరిరక్షణ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ వెల్లడించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతి పత్రం సమర్పించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘం నాయకులు నగేశ్, వెంకటేశ్వర్లు, క్రాంతి ఉన్నారు.

అడకత్తెరలో 'కార్యదర్శి'

(5వ పేజీ తరువాయి)

పైపులైన్ లీకేజీలు అరికట్టడం, చేతిపంపులు పాడైతే సరిచేయడం, నీటి ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్, ఇలా గ్రామంలో తర చూ ఏర్పడే సమస్యలనీ కార్యదర్శులే సొంత డబ్బులు పెట్టుకొని చేయాల్సి వస్తోంది. నిధులు జీపీలో లేకపోవడం వల్ల ఈ సమస్య ఉందని చెప్పకనే చెబుతున్నారు. ఈ వెతలు ప్రభుత్వం నియమిం చిన ప్రత్యేకాధికారులకు సైతం కొన్ని చోట్ల లేకపోలేదు. తమ జీతాల్లో నుంచి ప్రతీ నెలా జీపీకి ఖర్చుపెట్టే వారు కూడా ఉన్నారు.

మార్చిలో కేంద్ర నిధులు

ప్రత్యేక పాలన ప్రారంభమైన తర్వాత ఈ ఏడాది మార్చి నెలలో కేంద్రం జీపీలకు నిధులు విడుదల చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు విడుదల కాలేదు. ఇక రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులు కూడా అందకపోవడంతో గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్ని నెలల పాటు మార్చిలో వచ్చిన కేంద్ర నిధులతో పంచాయతీలు నడిచినప్పటికీ, ముఖ్యంగా మైనర్ పంచాయతీలకు ఇబ్బందులే తలెత్తాయి. మేజర్ గ్రామ పంచాయతీలకు కొంత మేర డబ్బులు ఎక్కువగా విడుదల కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కానీ, ప్రస్తుతం ఇప్పుడు అందరి పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

భారమైన స్వచ్ఛదనం-పచ్చదనం

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం గ్రామాల్లో ఈనెల 9వరకు జరగనుంది. ఈ కార్యక్రమాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులే తమ భుజస్కంధాలపై వేసుకున్నారు. ఉదయం లేచిన నుంచి సాయంత్రం వరకు కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా వాటికి అయ్యే ఖర్చులు పూర్తిగా భరించడం వారి బాధ్యతే. ఇప్పటికే నిధులు లేక ఇబ్బందులు పడుతున్న సెక్రటరీలకు ఈ ప్రోగ్రామ్ పెద్ద సవాల్‌గా మారింది. ఏ పనులు చేయాలన్నా డబ్బులతో ముడిపడి ఉన్న అంశం కావడంతో కార్యదర్శులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ, జిల్లా ఉన్నతాధికారుల విజిటింగ్, కార్యక్రమాలు చేసేందుకు ప్రజలను తీసుకురావడం, పనులు చేసేందుకు ప్రైవేటు వ్యక్తులను కూలీకి తీసుకురావడం, మిషనరీ ఏర్పాటు, దోమల మందులు, బ్లీచింగ్, డోజర్ కిరాయిలు ఇలా ఎన్నో పనులకు డబ్బులు కార్యదర్శులు పెట్టుకోవాల్సి వస్తోంది.

రూ.లక్షకు పైగా ఖర్చు

మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు మైనర్ గ్రామ పంచాయతీల ఖర్చులు కొంచెం అటు ఇటుగా ఉన్నా వసతుల కల్పనలో సమానంగా ఉంటున్నారు. దీంతో జీపీ కోసం పెట్టే ఖర్చు ఇప్పటికే ఒక్కో కార్యదర్శికి రూ.లక్షకు పైగా దాటిందని తెలుస్తోంది. కొన్ని పనులకు ఎంబీ రికార్డులు చేయించి మరీ సిద్ధంగా ఉన్నారు. కానీ, గ్రామంలో మౌలిక వసతుల కల్పన కోసం పెట్టే ఖర్చులు రాసి పెట్టుకుంటున్నారు. దీంతో తమ జీతాలే కాకుండా బయట తెలిసిన వ్యక్తుల వద్ద అప్పులు చేసి గ్రామాలను నెట్టుకొస్తున్నారు. వీరికి సహకారంగా కొన్ని చోట్ల ప్రత్యేక అధికారులు చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

ఖాతాల్లో డబ్బులు ఫ్రీజ్

కొన్ని గ్రామపంచాయతీల్లో నిధులు ఉన్నప్పటికీ వాటిని విడుదల చేసేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఖాతాల్లో ఉన్న డబ్బులు తీసేందుకు చెక్కులతో బ్యాంకుకు వెళ్తే పాస్ కావడం లేదు. దీనిపై అధికారికంగా జిల్లా పంచాయతీ అధికారులు ధ్రువీకరించనప్పటికీ ప్రస్తుతం కార్యదర్శులు ఎదు ర్కొంటున్న సమస్యలు ఇవే. డబ్బులు ఉన్నట్లు చూపుతున్న ప్పటికీ వాటిని డ్రా చేసేందుకు మాత్రం వీలు లేదు. దీంతో మరింత ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో గ్రామంలో కొన్ని పనులు చేసి వాటిని తీసుకోని సదరు కాంట్రాక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులకు సైతం ఈతిప్పలు తప్పడం లేదు.

రాజకీయ ఒత్తిడి

ప్రత్యేక పాలన ప్రారంభమైన నాటి నుంచి కార్యదర్శులకు రాజకీయ ఒత్తిడి కూడా ఎక్కువైందనే చెప్పాలి. సర్పంచ్ లేకపోవడంతో ఏ చిన్న సమస్య ఏర్పడినా ఇటు ప్రజలతో పాటు ఇతర అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామా ల్లో చోటామోటా నాయకులు కార్యదర్శినే ప్రశ్నిస్తున్నారు. తమ కాలనీకి నీళ్లు రావడం లేదనో, స్ట్రీట్ లైట్ వెలగడం లేదనో, దోమల మందు కొట్టడం లేదనో ఏదో విధంగా కార్యదర్శిని ఏకంగా బెదిరింపులకు సైతం దిగుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ప్రత్యేక నిధులు అందించి ఇబ్బందులు లేకుండా చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 7: హనుమకొండ ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీలో 50 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫార్మసీ, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 30 యేళ్ల వయస్సుగల నిరుద్యోగులు అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7893394393లో సంప్రదించాలన్నారు.

తెలుగులో సంపత్‌రెడ్డికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పరిశోధకుడు వంగాల సంపత్‌రెడ్డి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు బుధవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి సంపత్‌రెడ్డికి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'చెరబండరాజు నవలలు, కథలు - తెలంగాణ జనజీవితం' అనే అంశంపై కేయూ మాజీ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే పర్యవేక్షణలో వంగాల సంపత్‌రెడ్డి పరిశోధన పూర్తి చేశారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వీరు అనేక అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ సాధించిన వంగాల సంపత్‌రెడ్డిని నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల హిందీ లెక్చరర్ కొమురారెడ్డితో పాటు పలువురు అభినందించారు.

అంతర్జాతీయ సెమినార్‌కు సంకినేని వెంకట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్‌కు ఈనెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు బుధవారం సెమినార్ నిర్వాహకులు వెంకట్‌కు ఆహ్వానం పంపినట్లు తెలిపారు. 'ట్రైబల్ లైవ్‌లీ వుడ్ ఫార్సన్స్ ఇష్యూష్ స్ట్రాటజీస్ ఫర్ ఇంపవర్‌మెంట్' అనే అంశంపై జరిగే సదస్సులో డాక్టర్ సంకినేని వెంకట్ 'డెమోక్రటైజేషన్ ఇన్ ట్రైబల్ ఏరియాస్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పిస్తారు. ఈ సందర్భంగా వెంకట్‌ను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, రాజనీతిశాస్త్ర అధ్యాపకులు అభినందించారు.

డాక్టర్ అడ్లూరికు భారత్ సేవా పరస్కారం



హనుమకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణిత శాస్త్రవేత్త, గణిత అవధాని డాక్టర్ అడ్లూరు నర్సింహమూర్తికి బెంగుళూరుకు చెందిన వెయిల్ ఫౌండేషన్ ఇండియా భారత సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. నాలుగు దశాబ్దాలుగా గణిత రంగంలో చేసిన విశేషసేవలకు, చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఆయన ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. డాక్టర్ అడ్లూరు గణితంపై రాసిన పదమూడు పరిశోధనా వ్యాసాలు వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఆయనను ఇప్పటికే పలు అవార్డులు వరించాయి. ముంబైకి చెందిన ఎంవీఎల్‌ఏ ట్రస్ట్ రాష్ట్రీయ ఆచార్య శిరోమణి అవార్డును, కిందటేడు గోవా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టర్‌ను ప్రదానం చేశాయి. గణిత అష్టావధానాలతో గుర్తింపు పొందిన డాక్టర్ నర్సింహమూర్తి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించుకున్నారు. మదర్ థెరిస్సా అవార్డును అందుకున్నారు.

'సినారె' పురస్కారానికి మహేందర్ ఎంపిక



హనుమకొండ కల్చరల్, ఆగస్టు 7: హనుమకొండ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు బిల్ల మహేందర్‌కు రాష్ట్ర స్థాయిలో అందించే సినారే పురస్కారం-2024కు ఎంపికయ్యారని సంస్థ అధ్యక్షుడు మడకెల్లి రాములు, నిర్వాహకులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మహాకవి సినారే కళాపీఠం యేటా డాక్టర్ సి.నారాయణరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో సాహిత్య రంగంలో విశేషకృషి చేసిన వారిని ఎన్నికచేసి ఈ పురస్కారాన్ని అందిస్తున్నారు. దానిలో భాగంగా జిల్లా నుంచి మహేందర్‌కు ఈ యేడు పురస్కారం లభించింది. పదిహేనేళ్లుగా మహేందర్ వివిధ ప్రక్రియలో సాహిత్య సేవ చేస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ సామాజిక, సమకాలిన అంశాలపై ఆరు కవితా సంపుటాలతో పాటుగా తన సంపాదకత్వంలో నాలుగు సంకలనాలను అచ్చు వేశారు. ఈ నెల 10న హైదరాబాద్‌లో సినారే కళా పీఠం వారి ఆధ్వర్యంలో తెలంగాణ తొలి సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా ఈ సత్కారం జరుపబడుతుందని నిర్వాహకులు తెలియజేశారు. మహేందర్‌కు పురస్కారం లభించడంపై ఓరుగల్లు కవులు, రచయితలు, ఉపాధ్యాయులు సంతోషంతో పాటు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సామల సదానందం



మంత్రి నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆడెపు శ్రీనివాస్

ఇద్దరు నేతన్నలకు రాష్ట్ర స్థాయి అవార్డులు

హైదరాబాద్‌లో అందజేసిన మంత్రి తుమ్మల

ఆటోనగర్ (వరంగల్), ఆగస్టు 7: జాతీయ చేనేత కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో బుధవారం వేడుకలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి చేనేత జౌళి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ క్రమంలో వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడకు చెందిన ఇద్దరు చేనేత కార్మికులు సామల సదానందం, ఆడెపు శ్రీనివాస్‌కు ఆయన కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి అవార్డులతో పాటు రూ.25వేల నగదు బహుమతిని చెక్కుల రూపంలో అందజేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి చేనేత కార్మికుల పోటీల్లో సామల సదానందం(సీఎం రేవంత్‌రెడ్డి బొమ్మ), ఆడెపు శ్రీనివాస్(మహాత్మా గాంధీ బొమ్మ)ల డిజైన్లను నేసి ప్రదర్శించినందుకు గాను ఈ అవార్డులకు ఎంపికయ్యారు. అనంతరం వరంగల్ కార్పెట్లను వివిధ దేశాలకు, దేశంలోని వివిధ రాష్ట్రాలకు సొంత మార్కెట్ వ్యవస్థను నెలకొల్పి చేనేత కార్మికులకు నూతన డిజైన్ల ఆర్డర్లను ఇప్పిస్తూ చేనేత కార్మికులకు పనికల్పిస్తున్న వరంగల్ కొత్తవాడకు చెందిన యువకుడు చిప్ప కిరణ్‌కుమార్ నేతను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పప్పుల వెంకటేశం, డిప్యూటీ డైరెక్టర్ ఇందుమతి, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వరు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, నాయకులు ఎం.రవికుమార్, వరలక్ష్మి, రూప తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఎస్డీఎల్‌సీఈ ఎంఎస్‌డబ్ల్యూ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు7: కాకతీయ యూనివర్సిటీ మాస్టర్ ఆఫ్‌సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) ఫైనల్ ఇయర్ పరీక్షలు ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో రివైజ్డ్ పరీక్షల షెడ్యూల్‌ను వెల్లడించారు. ఆగస్టు 17, 20, 24, 28, 30, సెప్టెంబరు 2వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షల జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులకు క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షలకేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

13 నుంచి దూరవిద్య బీఎల్ఐఎస్సీ పరీక్షలు

ఈనెల 13 నుంచి బ్యాచ్‌లర్ ఆఫ్ లైబ్రరీ ఇన్ఫర్మేష న్ సైన్స్ (బీఎల్ఐఎస్సీ) ఎక్స్‌అభ్యర్థుల రివైజ్డ్ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఆగస్టు 13, 16, 19, 21, 23, 27, 29 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగు తాయని పేర్కొన్నారు. అలాగే ఆగస్టు 30న మధ్యాహ్నం ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

13 నుంచి బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఈనెల 13నుంచి కేయూ బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయి. ఆగస్టు 13, 16, 19, 21 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాల, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కేయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు షురూ

కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని పీజీ కోర్సుల ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్) రెండో సెమి స్టర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షలు ఆగస్టు 7, 9, 12, 14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. వర్సిటీ పరిధిలో 5,150 మంది పరీక్షలు రాయనున్నారు. బుధవారం పరీక్షల నిర్వహణను పరీక్షల నియంత్రణాధికారులు పరిశీలించారు.



నిండుకుండలా లక్నవరం చెరువు




మత్తడి దుంకుతున్న లక్నవరం జలాలు

లక్నవరం చెరువుకు మత్తడి

గోవిందరావుపేట, ఆగస్టు 7: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ప్రఖ్యాత లక్నవరం చెరువు మత్తడి పోస్తోంది. 33.6 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన చెరువు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోగా ఎగువ నుంచి పెద్దఎత్తున వరద పోటెత్తడంతో బుధవారం ఉదయం నుంచి 5 సెంటీమీటర్ల ఎత్తులో జలాలు మత్తడి దునుకుతున్నాయి. దీంతో దయ్యాలవాగులో ప్రవాహం పెరిగింది. కొత్తగూడ, గంగారం అటవీ ప్రాంతం నుంచి, బొగ్గుల వాగు నుంచి లక్నవరానికి వరద కొనసాగుతోంది.

నిండా నీటితో కళకళలాడుతున్న లక్నవరం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. తేలికపాటి వర్షాలు కురుస్తుండటం, సందర్శనకు ఆంక్షలు లేకపోవడంతో చెరువులో బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను తిలకించేందుకు టూరిస్టులు తరలిరానున్నారు.



జలకళతో పాకాల సరస్సు



మత్తడికి చేరువైన నీరు

మత్తడికి చేరువలో పాకాల చెరువు

ఖానాపురం, ఆగస్టు 7: వరంగల్ జిల్లాలోనే సాగునీటి వనరుల్లో పెద్దదైన పాకాల సరస్సు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. సరస్సు జలకళను సంతరించుకొని మత్తడికి చేరువలోకి వచ్చింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సు బుధవారం నాటికి 29.8 అడుగుల నీటిమట్టానికి చేరుకుని నిండు కుండలా ఉంది. సరస్సు పూర్తి నీటి సామర్థ్యం 30.2 అడుగులు కాగా, మరో ఆరు ఇంచుల నీరు చేరితే మత్తడితో పరవళ్లు తొక్కనుంది. పాకాల ఆయకట్టులో వరినాట్లు జోరుగా సాగుతున్న తరుణంలో ఆయకట్టు రైతులు జలకళను సంతరించుకున్న పాకాల సరస్సును సందర్శించి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గూడూరు మండలం భీమునిపాదం జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

ఉప్పొంగుతున్న భీమునిపాదం

జలపాతం వద్ద పర్యాటకుల సందడి

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 7 : ఎత్తైన గుట్టలు, ఆరుదైన వృక్షాలు, అబ్బురపరిచే భీమునిపాదం జలపాతం వద్ద పర్యాటకుల సందడి పెరిగింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతం 70 ఫీట్ల ఎత్తునుంచి వాటర్‌ఫాల్స్ జాలువారుతున్నాయి. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షానికి భీమునిపాదంలో వాటర్‌ఫాల్స్ ఉధృతంగా జాలువారుతున్నాయి. పచ్చని ప్రకృతి నడుమ, ఆహ్లాదకరమైన వాతావరణంలో వాటర్‌ఫాల్స్ కింద తడుస్తూ పర్యాటకులు కేరింతలు కొడుతున్నారు. భీమునిపాదంలో పచ్చని ప్రకృతిని ఆస్వాదించడానికి వాచ్‌టవర్ కూడా నిర్మించిన విషయం విదితమే. బుధవారం కురిసిన వర్షానికి భీముని పాదంలో వాటర్‌ఫాల్స్ భారీస్థాయిలో జాలువారుతుండడంతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. హన్మకొండ నుంచి భీమునిపాదంకు కేవలం 70 కిలోమీటర్లు, మహబూబాబాద్ నుంచి 40 కిలో మీటర్లు ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు, అటవీశాఖసిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కేయూ డిగ్రీ విద్యార్థులకు ఇన్‌స్టంట్ అవకాశం

- 6వ సెమిస్టర్ ఏదైనా ఒక్కపేపర్ తప్పిన వారికే..
- 12 వరకు ఫీజు గడువు.. 17న పరీక్ష..

కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ విద్యార్థులకు వర్సిటీ అధికారులు సువర్ణ అవకాశాన్ని కల్పించారు. ఇటీవల నిర్వహించిన డిగ్రీ 6వ సెమిస్టర్‌లో ఏదైనా ఒకే ఒక్క పేపర్ తప్పిన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రత్యేకంగా ఇన్‌స్టంట్ పరీక్షను నిర్వహిస్తారు. వర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ తదితర కోర్సుల్లో ఆఖరు సెమిస్టర్‌లో ఏదైనా థియరీ పేపర్‌లో తప్పిన అభ్యర్థులు ఆగస్టు12 వరకు ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలదేవి బుధవారం తెలిపారు. బీఏ, బీకామ్, జనరల్ (బీఏ లాంగ్వేజెస్) అభ్యర్థులు రూ.450, బీఏ, బీబీఏ, బీకాం, బీఎస్సీ, కంప్యూటర్ అభ్యర్థులు రూ. 550, బీసీఏ అభ్యర్థులు రూ. 650, బీకామ్ వొకేషనల్ రూ. 720 కళాశాలలో చెల్లించుకోవాలని తెలిపారు. ఫీజులు చెల్లించుకున్న అభ్యర్థులకు ఆగస్టు 17న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. కాగా, కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్‌లో ఎల్‌బీ కళాశాల, హనుమకొండలో వాగ్దేవి డిగ్రీ కళాశాల, ఉమ్మడి ఆదిలాబాద్ మంచిర్యాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాయ్స్) ఉమ్మడి ఖమ్మంలో పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖమ్మంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గర్ల్స్ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వానతో తప్పని వెతలు

పలు గ్రామాలకు రాకపోకలు బంద్

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 7: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు ఏజెన్సీని అతలాకుతలం చేస్తున్నాయి. రెండు రోజులుగా విరామం లేకుండా మండలంలో భారీ వర్షం పడుతోంది. దీంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గిరిజన గ్రామాల్లోని రోడ్లన్నీ వాగులను తలపిస్తున్నాయి. మండలంలోని జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. బానాజీబంధం- ఎలిశె ట్టిపల్లి గ్రామాల మధ్య జంపన్నవాగు ఉధృతి కారణంగా ఎలిశెట్టిపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. రొయ్యూర్- చల్పాక గ్రామాల మధ్య నాగులమ్మ ఒర్రెకు వరద ఉధృతి పెరగడంతో చల్పాక, అల్లంవారి ఘణపురం, వీరాపురం తదితర గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దొడ్ల- మల్యాల గ్రామాల మధ్య జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీ తదితర గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచి పోయాయి. కొండాయి- ఊరట్టం గ్రామాల మధ్య రహదారి పూర్తిగా బురదమయం కావడంతో ఆ రహదారి వెంట వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.


ఏటూరునాగారంలో ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు

గోదావరి దోబూచులాట

మహదేవపూర్, ఆగస్టు 7 : కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి ప్రాణహిత నదుల ప్రవాహం తగ్గుతూ పెరుగుతూ వస్తోంది. మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రాణహిత నుంచి ఎక్కువగా వరద వస్తోంది. కాళేశ్వరం త్రివేణి సంగమ పుష్కరఘాట్ నుంచి నదీ ఉధృతంగా ప్రవహిస్తోంది. 20 రోజులుగా ఉభయ నదుల వరద పుష్కరఘాట్‌ను తాకుతూ వెళ్తోంది.

పత్తి చేలల్లోకి వరదనీరు

కాటారం : మండలంలో మంగళవారం రాత్రి భారీగా, బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో ఉన్న పత్తి చేలల్లోకి, వరి పొలాల్లోకి వరదనీరు చేరి నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా వరసగా కురుస్తున్న వర్షాలతో పత్తి పంట ఎర్రబారి ఎదుగుదల నిలిచిపోతోందని ఆందోళన చెందుతున్నారు. వర్షంతో చెరువులు, కుంటలు మరోసారి మత్తళ్లు దుముకుతున్నాయి.

రోడ్లు జలమయం

వాజేడు : మండలంలో బుధవారం ఉదయం ఏకదాటిగా భారీ వర్షం కురిసింది. ఏమాత్రం విరామం ఇవ్వకుండా రోజంతా వర్షం పడుతూనే ఉంది. తుఫాను ప్రభావం వాజేడు మండలంలో తీవ్రంగా కనిపించింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షపు నీరు రోడ్లపైకి చేరి చిన్నపాటి చెరువులను తలపించాయి. ముఖ్యంగా జగన్నాథ పురం-వాజేడు ప్రధాన రహదారి జగన్నాథపురం, కాచారం వద్ద వరద నీరు రోడ్లపైకి చేరడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. మోకాల్లోతు వరకు నీరు ప్రవహించడంతో ప్రయాణికులు అవస్థ పడ్డారు. అదే విధంగా ప్రగళ్ల పల్లి-వెంకటాపురం వైపు వెళ్లే రహదా రిని సైతం వరద నీరు ముంచెత్తింది. పూసూరు అంగన్‌వాడీ కేంద్రం, జగన్నా థపురం పాఠశాలలోకి వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

పొంగిపొర్లుతున్న వాగులు

వెంకటాపురం(నూగూరు) : మండలంలో గత రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద నీరు భారీగా వాగులోకి చేరి ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. దీంతో కలిపాక, ముత్తారం, పెంక వాగు, కర్రవానిగుంపు గ్రామా లకు రాకపోకలు నిలిచిపో యాయి. కాగా, మండల పరిధిలోని జిన్నెలవాగు, కంక లవాగు, రాచపల్లి వాగులు ఉధృతంగా ప్రవహి స్తున్నాయి.

'దేవాదుల' పంపింగ్ బంద్

కన్నాయిగూడెం, ఆగస్టు 7 : మండలంలోని గుట్టల గంగారం వద్ద జె.చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి పంపింగ్‌ను బుధ వారం నిలిపివేశారు. సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి బుధవారం స్వల్పంగా పెరిగింది. ఎగువ నుంచి 5,54,810 క్యూసె క్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో ప్రాజెక్టులోని మొత్తం 59 గేట్లు ఎత్తి, వచ్చిన నీటిని వచ్చి నట్టు దిగువకు వదులు తున్నారు. బ్యారేజీ వద్ద 79.80 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

రైతులకు తీవ్ర ఇబ్బందులు

మంగపేట, ఆగస్టు 7: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో వరినాట్లు వేసుకునే రైతులకు తీవ్ర ఇబ్బంది కలిగింది. ఎలాంటి గెరువు ఇవ్వని జోరువానతో వాగులు, వంకలు, ఒర్రెలు పొంగి పోర్లాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. చాలా చోట్ల నివేశిత ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కమలాపురంలో జీడీవాగు, మంగపేటలో గౌరారం వాగు, కమలాపురం- ఏటూరునాగారం మార్గ మధ్యలోని జీడీవాగు, మల్లూరు వాగు, చుంచుపల్లివాగు, రాజుపేట సమీపంలోని ముసలమ్మవాగులు పొంగి పోర్లుతున్నాయి. దీంతో పంట పోలాలకు వర్షపు నీరు చేరి నీటమునిగాయి. చెరువులు, కుంటలు మరోసారి మత్తడి పోస్తున్నాయి. కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్ మంగపేట పుష్కరఘాట్ వద్ద గోదావరి సముద్ర మట్టానికి 85 ఫీట్ల లోతుతో వరద ప్రవాహం సాయంత్రం పెరిగింది. దీంతో గోదావరి తీరంలో గల కమలాపురం, పొద్మూరు, బోరున ర్సాపురం, మల్లూరు, చుంచుపల్లి, పాలాయిగూడెం, వాడగూడెం, దేవనగరం, కత్తిగూడెం, అకినేపల్లి- మల్లారం, ఎస్టీ కాలనీల్లో పంట చేనులు గోదావరి బ్యాక్ వాటర్ చేరి మునిగిపోయాయి. ఇవుతలి వైపు గోదావరి వరద పోటుతో విలువైన భూములు గోదావరిలో కలిసి పోయాయి. దీంతో లోతట్టు ప్రాంతాలలో అధికారులు పర్యటించి తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.



మత్తడి పోస్తున్న మల్లూరు మధ్య తరహా ప్రాజెక్టు

మల్లూరు మధ్యతరహా ప్రాజెక్టు మత్తడి

నర్సింహసాగర్‌లోని మల్లూరు వాగుపై నిర్మించిన మధ్య తరహా ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. ఎగువన కురిసిన వర్షాలకు ప్రాజెక్టు నిండి మత్తడి పోస్తోంది. 115.25 మీటర్లు ఉన్న నీటిమట్టం 115.30 మీటర్లకు చేరింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 0.367 టీఎంసీ కాగా ప్రస్తుతం 0.371 టీఎంసీ ఉంది. ప్రాజెక్టుకు 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతోంది. నీరు సమృద్ధిగా చేరడంతో బుధవారం మధ్యాహ్నం ప్రాజెక్టుకు మత్తడిపడింది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

కాళేశ్వరాలయంలో నైమిశారణ్యం పీఠాధిపతి

మహదేవపూర్, ఆగస్టు 7 : శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవాల యాన్ని ఉత్తర ప్రదేశ్‌లోని నైమిశా రణ్యం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి బుధవారం సందర్శించారు. వేద పండితులు, దేవస్థాన అర్చకులు ఆయనకు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం కాళేశ్వర ముక్తీ శ్వరస్వామి వారికి బాలబ్ర హ్మానంద సరస్వతి అభిషేకం చేశారు. పార్వతి అమ్మవారిని, మహా సరస్వ తిని దర్శించుకున్నారు. అనంతరం పార్వతి అమ్మవారి ఆలయంలో పీఠాధిపతికి ఆలయ సీఈవో ఎ. మారుతి, అర్చక స్వాములు, వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ క్రమంలో శ్రీ మహా కాలశివలీల విలాసం ప్రవచనాలను బాలబ్ర హ్మానంద సరస్వతి అందించారు. ఈ కార్యక్రమంలో సూపరిం టెం డెంట్ బుర్రి శ్రీనివాస్, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.


కాళేశ్వరాలయంలో ప్రసంగిస్తున్న బాలబ్రహ్మానంద సరస్వతి

హేమాచలుడి దర్శనం

మంగపేట : మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామిని నైమిశారణ్యం పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి దర్శించు కున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రవణం సత్యనారాయణ, ప్రధానార్చకులు కైంకైర్యం రాఘావాచార్యులు, ముక్కమళ్ల రాజశేఖరశర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న బాలబ్రహ్మానంద సరస్వతి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పవన్‌కు మారాచార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మ, ఉద్యోగులు సీతారాములు, శేషు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా సర్కారు విద్య

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 7: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన అందించడమే రేవంత్ సర్కారు ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు షూస్, టై, బెల్టు, ఐడీకార్డులు, డైరీలు, మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సౌకర్యాలను కల్పిస్తోందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతున్నాయన్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం గత సంవత్సరం గొర్లవీడు పాఠశాలలో చదివి త్రిపుల్ ఐటీ బాసర విద్యా సంస్థకు ఎంపికైన మారెపల్లి అక్షితను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈవో నారాయణరావు, ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారి రవీందర్‌రావు, డీఎల్‌పీవో వీరభద్రం, ఎంపీవో నాగ రాజు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంనేని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు టైం, షూ, బెల్టులను అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

గణపురం : స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా ప్రతి ఒక్కరూ కనీసం ఐదు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో జరిగిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం 91 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదలైన రూ. 22లక్షల చెక్కులను అందచేశారు. రైతువేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎంపీడీవో భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ అశోక్, నాయకులు చోటేమియా, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 7: ములుగు జిల్లాపరిషత్ ప్రత్యేక అధికారిగా ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ పాలకవర్గం, జడ్పీచైర్మన్ పదవీకాలం మంగళవారంతో ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించగా ఆయన బాధ్య తలు చేపట్టారు. ఈసందర్భంగా జడ్పీ కార్యాలయ అధికారులు, సిబ్బంది కలెక్టర్ దివాకరకు మొక్కను అందజేసి శాలువాతో సన్మానించారు. జడ్పీ సీఈవో సంప త్‌రావు, డిప్యూటీ సీఈవో జి.జవహర్‌రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

రేగొండ, ఆగస్టు 7: బాగిర్థిపేట పంచాయతీ కార్యదర్శి అజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాహుల్‌శర్మ బుధారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమాన్ని అమలు చేయడంలో నిర్ల క్ష్యం వహించినందుకు చర్యలు తీసు కున్నారు. అంతే కాకుండా ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరైనం దుకు వేటు పడింది.

మన వస్త్రాలకు విదేశాల్లో ఆదరణ

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

చేనేత కార్మికులకు సన్మానం

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 7: మన వద్ద తయా రయ్యే వస్త్రాలకు విదేశాల్లో బహు ఆదరణ లభిస్తోందని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పది మంది చేనేత కార్మికులను కలెక్టర్ సన్మానించారు. చేనేత పరిశ్రమ మన దేశంలో విశిష్టత కలిగి ఉందన్నారు. స్వాతంత్ర్య సముపార్జనలో ఒక సాధనంగా నిలిచిందని, అహింసాయుత ఉద్యమానికి నాంది పలికిందని అన్నారు. మహదేవపూర్ మండలంలో దసలిపట్టు వస్త్రాలకు మంచి గుర్తింపు ఉందని, ఇవి విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. ఈ పరిశ్రమ మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి చేనేత కుటుంబాలను కలుస్తానని, ప్రణాళికాబద్ధంగా వారి సంక్షేమం కోసం పాటుపడతామని అన్నారు. ఈ కార్యక్ర మంలో కలెక్టరేట్ ఏవో మొయినుద్దీన్, చేనేత కార్మిక సంఘం నాయకులు భీమనాథుని సత్యనారాయణ, మాచర్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


చేనేత కార్మికుడిని సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి

5వ పేజీ తరువాయి

త్వరితగతిన పూర్తి చేసుకునే అవకాశం ఉంటుం దన్నారు. ఆ దిశగా ఆర్థిక సంఘం జిల్లాలకు స్పెషల్ ఫండ్స్ మంజూరు చేయాలని కోరారు. బకాయిలు ఉన్న ప్రతీ గ్రామపంచాయతీకి ప్రభుత్వ పనుల చెల్లింపులు వా టికి అయిన నిధులు వెంటనే మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక సంఘం మెంబర్ సెక్రెటరీ స్మితా సబర్వాల్ మాట్లాడారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మమబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, ఆర్థిక సంఘం సభ్యులు రమేష్ నాయక్, నెహ్రూనాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్, జిల్లా పరిషత్ సీఈవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

ములుగు రూరల్ ఆగస్టు 7: వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. ములుగు మండలం రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఓపీ, ఐపీ, ఫార్మసీ, ల్యాబ్, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు ఇచ్చారు.

అవయవదానంపై అవగాహన

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 7: నేత్ర, అవయవ దాన ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం భూపాలపల్లి పట్ట ణంలోని తేజస్విని జూనియర్ కళాశాల ఆవరణలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐక్యవేదిక ప్రతినిధులు కామిడి సతీష్‌రెడ్డి, బిల్లా రాజిరెడ్డి సారథ్యం వహించగా పలువురు స్థానికులు పాల్గొన్నారు. అవయవ దానంపై అవగాహన కల్పించారు. ఎస్పీ కిరణ్ ఖరే, ఏవో తాజొద్దీన్, డీఎంహెచ్‌వో మధుసూదన్‌ను కలిసి అవయవ దానంపై వివరించారు. కన్వీనర్ ఈశ్వర లింగం, కోకన్వీనర్ రామ్‌కల్యాణ్, వైద్యులు ప్రసాద్‌రావు, మల్లారెడ్డి, శంకర్‌యాదవ్, ఉద్యోగ సంఘాల నాయకులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కన్నాయిగూడెం, ఆగస్టు 7: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి గుడుంబాను తరలిస్తున్న మండలంలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన కావిరి అంజన్‌రావును పోలీసులు మంగళవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. 180లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.

న్యాయవాదుల నిరసన

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 7: జనగామ కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాద దంపతులు గద్దల సంపత్‌రావు, కవితపై దాడి చేసి గాయపరిచిన పోలీసుల దౌర్జన్యాన్ని ఖండి స్తూ ములుగులోని జిల్లా కోర్టు ఆవరణలో బుధ వారం న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు మసరగాని వినయ్‌కుమార్ మాట్లా డుతూ రాష్ట్రంలో తరచూ న్యాయవా దులపై దౌర్జన్యం చేస్తున్న పోలీసులపై సుమోటో కేసుగా స్వీకరించి దాడిచేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు వై.నర్సిరెడ్డి, వెంకటే శ్వర్‌రావు, చంద్రయ్య, భిక్షపతి, కొండి రవీందర్, చిరంజీవి, ప్రతాప్, అశోక్, రాజేందర్, విజయ్ కుమార్, మన్సూర్‌అలీ, సురేష్, రాజేందర్, లింగమూర్తి, ప్రణయ్, సంజీవ, అర్చన, నవత, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీకాలనీని సందర్శించిన అధికారులు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 7: భూపా లపల్లి మండలంలోని గుర్రంపేట గ్రామ ఎస్సీకా లనీని జిల్లా స్థాయి అధికారుల బృందం బుధ వారం సందర్శించింది. సింగరేణి ఓసీ-3 మూ లంగా అనేక ఇబ్బందులు పడుతున్నట్లు కొంత కాలంగా అక్కడి వాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఇటీవల కలెక్టర్ రాహుల్ శర్మ స్పందించి జిల్లా స్థాయిలోని వివిధ శాఖల అధికారులను బృందంగా నియమించారు. దీంతో వారు ఆ గ్రామానికి వెళ్లి సింగరేణి ఓసీ-3 వల్ల కలుగుతున్న నష్టాలపై ఆరా తీశారు. ఇళ్లను, పరిసర ప్రాంతాల్లోని పంటలను పరిశీ లించారు. బృందంలో ఆర్డీవో మంగీలాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్, పం చాయతీ అధికారి నారాయణరావు, భూపాలపల్లి మండల తహసీల్దార్ శ్రీనివాసులు, జీఎం ఇండస్ట్రీస్, ఈఈ ఆర్‌అండ్‌బీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది ఉన్నారు.

సేవా దృక్పథం గొప్పది : జడ్జి జయరాంరెడ్డి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 7: నిరుపేదలకు సేవ చేయాలనే దృక్పథం చాలా గొప్పదని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జయరాంరెడ్డి అన్నారు. భూపాలపల్లి పట్ట ణంలోని రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన నిరు పేద మహిళ ఖైరున్‌కు స్వయం ఉపాధి కోసం జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ వితరణగా ఇవ్వగా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జయరాంరెడ్డితోపాటు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎన్.రాంచందర్‌రావు చేతుల మీదుగా ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి జయరాంరెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవలో ఉన్న గొప్పదనం మరెందులోనూ లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఈ దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి, బార్ అసోసి యేషన్‌జనరల్ సెక్రటరీ మహేందర్, మైనారిటీ నేత అబ్దుల్ ఫజల్ తదితరులు పాల్గొన్నారు.


కుట్టు మిషన్‌ను అందజేస్తున్న జడ్జిలు

రామప్ప హుండీ ఆదాయం రూ.3.95 లక్షలు

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 7: మండలంలోని రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయ హుండీలను బుధవారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిశీలకులు డి.అనిల్‌కుమార్, ఈవో బిల్ల శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈకార్యక్రమం జరిగింది. సిబ్బంది హుండీల్లోని కానుకలను లెక్కించగా మొత్తం రూ.3,95,140 ఆదాయం సమకూరినట్లు డి.అనిల్‌కుమార్ తెలిపారు. ఇందులో రూ.3,76,535 నోట్లు, రూ.18,605 నాణేలు వచ్చాయని, మొత్తం హుండీల ఆదాయం రూ.3,95,140 సమకూరాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఏఎస్సై కిష్టయ్య, ఆలయ అర్చకులు కె.హరీష్‌శర్మ, ఉమాశంకర్, ఆలయ సిబ్బంది, పురావస్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ న్యాయ కళాశాల కోసం ఉద్యమించాలి

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 7: భద్రాచలం కేంద్రంగా ఆదివాసీ న్యాయ కళాశాల కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కొమురంభీం కాలనీలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలం కేంద్రంగా ఆదివాసీ న్యాయ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల ఆదివాసీ విద్యార్థులకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఆదివాసీ న్యాయ కళాశాల కోసం ఈనెల 30 నుంచి మండలాల్లో ఒక్కోరోజు ధర్నాను చేపడుతున్నట్టు తెలిపారు. ఈసమావేశంలో నాయకులు పూనెం ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి అవార్డు

మహదేవపూర్, ఆగస్టు 7 : మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు గోరంటల శ్రీనివాస్‌కు కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డును ప్రదానం చేశారు. చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఓ ఆడిటోరియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఈ పురస్కా రంతోపాటు రూ.25 వేల పారితోషికాన్ని అందజేశారు.


మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

కాటారం, ఆగస్టు 7: బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, పెద్దపల్లి మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధు మండల కేంద్రంలో బుధవారం పర్యటించారు. వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన కటుకు శ్రీనివాస్, మొగిలి గట్టయ్య కుటుంబ సభ్యులను పుట్ట మధు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, డివిజన్, మండల నాయకులు మందల లక్ష్మారెడ్డి, పంతకాని సడువలి, సతీష్, వెంకటస్వామి, శ్రీశైలం, శంకర్, దుర్గారావు, రాజబాపు, లింగయ్య, మొగిలి, బాపు, అశోక్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కాటారం, ఆగస్టు 7: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోగల సబ్ సెంటర్ల వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి వ్యాధులు దరిచేరకుండా చూడాలని కోరారు. ఒడిపిలవంచ సబ్ సెంటర్ పరిధిలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. దోమల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ తిరుపతిరెడ్డి, హెచ్‌ఏ సమ్మయ్య, జీపీ కార్యదర్శి అపర్ణ, ఏఎన్‌ఎంలు పద్మ, శ్యామల, ఎఫ్‌ఏ మురళి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న జయంతిని విజయవంతం చేయాలి

ములుగు రూరల్ ఆగస్టు 7: ఈనెల 18న జరిగే సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య గౌడ్ కోరారు. ములుగు మండలం జంగాలపల్లిలో బుధవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడిన వారికి కార్పొరేషన్ నుంచి ఇస్తున్న ఆర్థికసాయాన్ని రూ. 15 వేల నుంచి 25 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాయపడి మరణించిన వారి కుటుంబాలకు ఇస్తున్న పరిహారాన్ని రూ. 25 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలన్నారు. మెడికల్ బోర్డును తక్షణమే రద్దుచేయాలని కోరారు. తాటి చెట్ల పెంపకం కోసం ప్రతి సొసైటీకి పదెకరాల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు కూనూరు అశోక్ గౌడ్, పులి రవిగౌడ్, ముస్నీపల్లి భిక్షపతి గౌడ్, బొడిగే భిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

చిట్యాల, ఆగస్టు 7: చిట్యాల వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకర ణోత్సవం గురువారం జరగనుంది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతోపాటు స్టేట్ కార్పొరేషన్ ట్రేడ్ యూనియన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి హాజరు కానున్నారు.

కాళేశ్వరంలో శ్రావణ బుధవారం

మహదేవపూర్, ఆగస్టు 7 : శ్రావణ బుధవారం సందడి సందర్భంగా కాళేశ్వ రంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు మొదటగా త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించి అనంతరం ఆల యంలోని శ్రీ కాళేశ్వరముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. బిల్వ ఆకులతో పూజలు నిర్వహించారు. అనంతరం శుభానందదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో 'స్వచ్ఛదనం-పచ్చదనం'

గోవిందరావుపేట, ఆగస్టు 7: మండలంలోని లక్నవరం సరస్సు ప్రాంతంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది బుధవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈసంద ర్భంగా సరస్సు పరిసర ప్రాంతాలతోపాటు బుస్సాపూర్, పస్రా గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి పరిసరాలను శుభ్రం చేశారు. పస్రా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మాధవిశీతల్, డిప్యూటీ ఆర్వో శోభన్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు వేణుగోపాల్, నర్సయ్య, సుజాత, బీట్ ఆఫీసర్లు దీప్‌లాల్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.